## జీవనోపాధిని బలోపేతం చేయాలి



**దశ, న్యూఢిల్లీ:** మాగుంట శ్రీనివాసులు రెడ్డి గారి అధ్యక్షతన పార్లమెంటులో జరిగిన 'గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ' సమావేశంలో భాగంగా బుధవారం పీఎం స్వనిధి పథకం పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వీధి వ్యాపారుల జీవనోపాధిని బలోపేతం చేయడం, ఆర్థిక సాధికారతను పెంపొందించడం, ఆర్థిక కార్యకలాపాలను వృద్ధి చేయడం మరియు వారి డిజిటల్ ఎంపవర్‌మెంట్‌ను పెంచేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించాము. ఈ సందర్భంగా, లబ్ధిదారుల ధృవీకరణ పత్రాలు (బెనిఫిషియరీ సర్టిఫికెట్లు) పొందడంలో ఉన్న ఇబ్బందులు, డాక్యుమెంటేషన్ అడ్డంకులు, అసలైన లబ్ధిదారులను గుర్తించడంలో వస్తున్న సమస్యలు మరియు క్రెడిట్ కార్డుల జారీలో జరుగుతున్న ఆలస్యం వంటి వీధి వ్యాపారులు ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను కమిటీ దృష్టికి తీసుకెళ్లాను. ప్రక్రియలను మరింత సరళీకృతం చేసి లబ్ధిని సకాలంలో అందించాలని అధికారులను కోరాను. తద్వారా పీఎం స్వనిధి పథకం అర్హులైన ప్రతి వీధి వ్యాపారికి సమర్థవంతంగా చేరుతుందన్నారు.

## ప్రాణాలు కాపాడిన కోర్టు కానిస్టేబుల్



**దశ, సిరిసిల్ల:** సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలో గుండె నొప్పితో కుప్పకూలిని వ్యక్తికి సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కొనరావుపేట కోర్టు కానిస్టేబుల్ భాస్కర్ జిల్లా కోర్టు ఆవరణలో ఇల్లంతాకుంట మండలం కట్కూరు గ్రామానికి చెందిన వెంకటేశం కోర్టు కి హాజరు కాగా అకస్మాత్తుగా గుండె నొప్పితో కుప్పకులగా అక్కడే ఉన్న కొనరావుపేట పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ భాస్కర్ సకాలంలో స్పందించి సీపీఆర్ చేయడంతో బాధితుడు స్పృహలోకి రావడంతో పాటు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కానిస్టేబుల్స్ చాకచక్యంగా వ్యవహరించడంతో వెంకటేశం ప్రాణాలతో బయటపడ్డారు. సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ లను నెటిజన్లు అభినందిస్తున్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి తక్షణం సాయపడేలా పోలీసులకు ఉన్నతాధికారులు ఇప్పించిన సీపీఆర్ శిక్షణ ఓ నిండు ప్రాణం నిలబెట్టింది.

## పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

*ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు రాజ్ ఠాకూర్*



**దశ, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ నాయకులతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారి అధ్యక్షతన బుధవారం రోజున ఉదయం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొలి సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి మండలంలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని ఆయన సూచించారు. పార్టీ అధిష్టానం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు.

# మతాల పేరుతో రాజకీయాలు చేస్తే ఫలితాలు శూన్యం

- మైనార్టీల సంక్షేమానికి సర్కార్ కృషి..
- జగిత్యాల జిల్లా కేంద్రంలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు..
- రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్..
- జగిత్యాలతో మంత్రి అడ్లూరితో కలిసి మీడియా సమావేశం..



**దశ, జగిత్యాల:** మతాల పేరుతో రాజకీయాలు చేస్తే అభివృద్ధి శూన్యమని తాను మత రాజకీయాలకు దూరంగా ఉంటానని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ అన్నారు. జగిత్యాలలో మంత్రి అజారుద్దీన్‌తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ 1969 నుండి మొదలుకొని అనేక ఉద్యమాలు చేపట్టి తెలంగాణ రాష్ట్ర ప్రజలు స్వరాష్ట్రాన్ని 2014లో సాధించుకున్నారని అన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. క్రికెటర్ గా తన కెరియర్ ప్రారంభించి ప్రస్తుతం రాజకీయాల్లో కొనసాగు తున్నానని మంత్రి తెలిపారు. మతాల పేరుతో కొందరు రాజకీయాలు చేస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ అన్నారు. గత రాజకీయాలకు తాను దూరంగా ఉంటానని టీం వర్క్ చేస్తేనే ఫలితాలు వస్తాయని అజారుద్దీన్ తెలిపారు.

ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు రైసింగ్ తెలంగాణ పేరుతో ముందుకు సాగుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు తీసుకు వస్తున్నారని మంత్రి అన్నారు. విద్యా ద్వారానే సమాజంలో మార్పులు వస్తాయని ఎందుకు అనుగుణంగా విద్య వ్యవస్థలో ముఖ్యమంత్రి గారు సమూల మార్పులు తీసుకువచ్చారని మంత్రి అజారుద్దీన్ తెలిపారు. జగిత్యాల జిల్లాలో మైనార్టీ సమస్యలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మైనార్టీల సమస్యల పై ఒక సమావేశం ఏర్పాటు చేయాలని అజారుద్దీన్ స్థానిక నాయకులను కోరారు.

జిల్లా కేంద్రంలో ఈద్గా, కాబరస్థాన్ ఏర్పాటు పై కలెక్టర్ తో మాట్లాడి సమస్య ను పరిష్కరిస్తానని మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు.. విద్యార్థుల స్కాలర్ షిప్ సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. జగిత్యాల లో మెడికల్ కాలేజ్ ను చూస్తే సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాల సమస్యని పరిష్కరిస్తాని మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు. నేను బ్యాటింగ్ ఎంత స్పీడ్ గా చేస్తానో నేను మంత్రిగా అలానే పని చేస్తానని అన్నారు. జగిత్యాలలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని మంత్రి అజారుద్దీన్ హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోనే క్రీడాకారులకు సైతం జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగే విధంగా తనవంతుగా కృషి చేస్తానని మంత్రి అజారుద్దీన్ తెలిపారు.

జగిత్యాల జిల్లాలోని మైనార్టీ సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి మంత్రి అజారుద్దీన్ కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా కోరారు. క్రీడకారునిగా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర ప్రజల సేవ చేయడానికి రాజకీయాల్లోకి రావడం చాలా సంతోషమని మంత్రి అడ్లూరి అన్నారు. క్రీడాకారులకు కులం, మతం ఉండదని మంత్రి తెలిపారు. అజారుద్దీన్ మంత్రిగా రాణించి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ప్రాజెక్ట్ ల నిర్మాణం జరిగిందని జగిత్యాల జిల్లా వ్యవసాయానికి మారుపేరుగా మారడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** నాణ్యమైన ఆహార పదార్థాలు, మెరుగైన సేవలతో వినియోగదారుల మన్ననలు పొందాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తిరుమల స్వగృహ ఫుడ్స్ దుకాణాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహార ఉత్పత్తులను కోరుకుంటున్నారని, అలాంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపార సంస్థలు సేవలు అందించాలని సూచించారు.



తిరుమల స్వగృహ ఫుడ్స్ యాజమాన్యం నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు కందిబండ నాగరాజు, మామిడాల కళాధర్ మాట్లాడుతూ, తమ సంస్థకు ఆహార ఉత్పత్తుల తయారీ రంగంలో 30 సంవత్సరాల అనుభవం ఉందన్నారు. స్థానికంగా మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు సైతం తమ ఉత్పత్తులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, పుట్టినరోజు వేడుకలు, ఇతర ఫంక్షన్ల కోసం ఆకర్షణీయమైన డెకరేషన్‌తో ప్రత్యేక స్వీట్స్ బుట్టలను తయారు చేసి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గుణగంటి హేమ సతీష్, గండూరి పావని కృపాకర్, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ విత్తన రంగ అనుభవం నైజీరియా యువతకు ఉపయోగపడాలి

- తెలంగాణలో శిక్షణ పొందిన టరాబా రాష్ట్ర యువతకు సర్టిఫికెట్ల ప్రదానం
- వ్యవసాయం, విత్తన రంగాల్లో తెలంగాణ – టరాబా రాష్ట్రాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం
- శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్‌లో అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమం
- మంత్రి వివేక్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల

**దశ, హైదరాబాద్:** శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (IPE)లో నిర్వహించిన "అంతర్జాతీయ విత్తన విద్య మరియు పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం" బుధవారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి మరో మంత్రి వివేక్ తో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విత్తన రంగానికి కేంద్రంగా గుర్తింపు పొందిందని, ఆ అనుభవాన్ని నైజీరియాలోని టరాబా రాష్ట్ర యువతతో పంచుకోవడం సంతోషకరమన్నారు. ఈ శిక్షణ ద్వారా యువత విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ, విత్తన శుద్ధి, ప్రాసెసింగ్, వ్యవసాయ వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో ప్రాయోగిక పరిజ్ఞానం పొందారని తెలిపారు. టరాబా రాష్ట్ర ప్రభుత్వం తమ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ కల్పించేందుకు చూపుతున్న చొరవ అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా టరాబా రాష్ట్రంతో వ్యవసాయం, విత్తన సాంకేతికత, రైతు శిక్షణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణ మరియు టరాబా రాష్ట్రాల మధ్య "సిస్టర్ స్టేట్" భాగస్వామ్యానికి సంబంధించి చర్చలు కొన సాగుతున్నాయని, ఇది ఇరు ప్రాంతాల మధ్య పరస్పర అభివృద్ధికి దోహద పడుతుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఈ రెండు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని మంత్రి వివరించారు. టరాబా రాష్ట్ర యువత ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను తమ ప్రాంత అభివృద్ధికి వినియోగించి వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, నైజీరియాలోని టరాబా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అగ్బు కెఫాస్, టరాబా సీడ్స్ లిమిటెడ్, ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ప్రతినిధులు, శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

# భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసేవారికి "కౌన్సిలింగ్" ఇవ్వండి

*- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్*



**దశ, వరంగల్:** భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు "కౌన్సిలింగ్" నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయూసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీగదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ పరిశీలించారు.

అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా వున్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు ఎలావున్నారు..ఏం చేస్తున్నారు మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక "కౌన్సిలింగ్" ఇవ్వాలని, రౌడీ షీటర్లపట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీపై నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడంతో పాటు, ముందస్తూ సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమార్, రాజమౌళి పాల్గొన్నారు.

# పుష్కరాలకు అవసరమైన నిధులు సమకూర్చుతాం

- ఎక్కడ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోండి..
- పుష్కరాల సమీక్ష సమావేశంలో మంత్రి అడ్లూరి..




**దశ, జగిత్యాల:** 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు అవసరమైన నిధులు తీసుకువస్తానని భక్తులకు ఎక్కడ అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలపై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు రోడ్లు భవనాల శాఖ అధికారులు, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం బడ్జెట్ల లో వెయ్యి కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు కేటాయించిన పుష్కరాల నిధుల్లో జగిత్యాల జిల్లా రూ. 117 .08 కోట్లు కేటాయించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. మొదటి విడుదల కేటాయించిన నిధుల్లో ధర్మపురిలో అభివృద్ధి పనులకు రూ. 83.07 కోట్లు కోటిలింగాలకు రూ. 34.01 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురికి ఇరిగేషన్ శాఖ ద్వారా రూ. 22.02 కోట్లు, రోడ్లు భవనాల శాఖ ద్వారా రూ. 25.08 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 25.07 కోట్లు, దేవాదాయ శాఖ ద్వారా రూ.10 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కోటిలింగాలకు నీటి పారుదల శాఖ ద్వారా రూ 16.01 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ. 8 కోట్లు దేవాదాయ శాఖ ద్వారా రూ. 10 కోట్లు టైర్ వన్ లో విడుదలైనట్లు మంత్రి వివరించారు. ఇందుకు సంబంధించిన టెండర్లు త్వరలోనే పూర్తి అవుతాయని మంత్రి తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం చేపట్టాల్సిన పనులను అంచనాలు వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎందుకు సంబంధించిన నిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో చర్చించి విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

03
జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
గురువారం
04-06-2026
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట




WWW.DASHANEWS.COM

## ఆల్ ఇండియా ఐఐటీ ర్యాంక్ 856 సాధించిన బానోత్ సుమంత్‌ను అభినందించిన ఎమ్మెల్యే పాయం



**దశ, మణుగూరు:** ఆల్ ఇండియా ఐఐటీ ప్రవేశ పరీక్షలో 856వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటుకున్న మణుగూరు మండలంలోని పైలెట్ కాలనీకి చెందిన బానోత్ సుమంత్‌ను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఖమ్మంలోని శ్రీ చైతన్య కళాశాలలో విద్య నభ్యసిస్తున్న బానోత్ సుమంత్ జాతీయ స్థాయిలో 856వ ర్యాంక్ సాధించడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఎక్సలెంట్ పైలెట్ కాలనీ స్కూల్ పూర్వ విద్యార్థిగా సుమంత్ సాధించిన ఈ విజయం మణుగూరు ప్రాంతానికి, పినపాక నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు బానోత్ రవి, బానోత్ అరుణలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందిస్తూ, తమ కుమారుడి ఉన్నత విద్య కోసం వారు అందించిన ప్రోత్సాహం మరియు సహకారం ప్రశంసనీయమని అన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించిన సుమంత్ ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సుమంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం శ్రీ చైతన్య కళాశాల బోటనీ లెక్చరర్ రావులపల్లి నరసింహారావు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, అభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల భద్రతే ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటి సీఎం

*విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన లైన్‌మెన్ కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా*



**దశ, హైదరాబాద్:** బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజల సేవలో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి అండగా నిలుస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారు ప్రజాభవన్‌లో రూ.1 కోటి విలువైన ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న శ్రీ సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో మరణించగా, ఆయన సతీమణి మరియు నామినీ శ్రీమతి సోన్కాంబ్లే స్వప్నకు ఈ బీమా మొత్తాన్ని అందించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎన్పీడీసీఎల్ కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం (MoU) ప్రకారం, USSA2 / USSA3 శాలరీ ప్యాకేజ్ పథకాల కింద ఉద్యోగులకు రూ.1 కోటి విలువైన వ్యక్తిగత ప్రమాద బీమా రక్షణ కల్పించబడుతోంది. ఈ పథకం ద్వారా మృతుడి కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు మరియు ఇతర అధికారులు పాల్గొని బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# జనసేన పార్టీలో చేరిన డాక్టర్ గడల శ్రీనివాసరావు

❖ *కొత్తగూడెంలో పోటీ చేసే అవకాశం*



**దశ, హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మాజీ డైరెక్టర్, డాక్టర్ గడల శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి నివాసంలో జరిగిన కార్యక్రమంలో గడల శ్రీనివాసరావు గారికి పవన్ కళ్యాణ్ గారు పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, డాక్టర్ గడల శ్రీనివాసరావు కుటుంబంతో తమ కుటుంబానికి ఎంతో కాలంగా సన్నిహిత అనుబంధం ఉందన్నారు. ప్రజాసేవ పట్ల అంకితభా వం, నిజాయతీ, పరిపాలనా దక్షత కలిగిన అధికారిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రజల్లో విశేష గౌరవం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యుడిగా ప్రారంభమైన ఆయన సేవా ప్రస్థానం ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ స్థాయికి చేరుకోవడం ఆయన కృషి, నిబద్ధతకు నిదర్శనమన్నారు.

ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ గడల శ్రీనివాసరావు వంటి అనుభవజ్ఞులు, సేవాభావం కలిగిన వ్యక్తులు జనసేనలో చేరడం పార్టీకి మరింత బలాన్ని, విశ్వసనీయతను తీసుకువస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన, పరిపాలనా అనుభవం, సమాజంలోని వివిధ వర్గాలతో ఆయనకు ఉన్న అనుబంధం తెలంగాణలో పార్టీ విస్తరణకు దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజ సేవను లక్ష్యంగా పెట్టుకుని రాజకీయాల్లోకి వస్తున్న డాక్టర్ గడల శ్రీనివాసరావును హృదయపూర్వకంగా జనసేన కుటుంబంలోకి ఆహ్వానిస్తూ, తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ, శ్రీ పవన్ కళ్యాణ్ గారితో తన అనుబంధం మెగాస్టార్ శ్రీ చిరంజీవి గారి ద్వారా ప్రారంభమైందని తెలిపారు. కాలక్రమేణా పవన్ కళ్యాణ్ గారి వ్యక్తిత్వం, నిజాయతీ, ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న నిబద్ధత తనను ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. తాను జనసేనలో చేరడం భావోద్వేగపూరిత నిర్ణయం కాదని, సమాజానికి మరింత విస్తృత స్థాయిలో సేవ చేయాలనే సంకల్పంతో తీసుకున్న ఆలోచిత నిర్ణయమని స్పష్టం చేశారు. యువతకు ఆశయాలను, దిశానిర్దేశాన్ని అందించే నాయకత్వం పవన్ కళ్యాణ్ గారిలో కనిపించిందని అన్నారు. ప్రస్తుత తరానికి విలువలతో కూడిన రాజకీయాలు అవసరమని, ఆ లక్ష్యంతో పనిచేస్తున్న జనసేన పార్టీ తనకు సరైన వేదికగా భావించానని తెలిపారు. ఇకపై జనసైనికుడిగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, తెలంగాణలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ప్రజాసేవే తన జీవిత లక్ష్యమని, ప్రభుత్వ సేవలో ఉన్నప్పుడు ఎలా అంకితభావంతో పనిచేశానో, ఇకపై ప్రజా జీవితంలో కూడా అదే నిబద్ధత, చిత్తశుద్ధితో ముందుకు సాగుతానని డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా వైద్య ఆరోగ్య రంగానికి చెందిన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ప్రజారోగ్య కార్యకర్తలు, యువత, మహిళలు, మేధావులు మరియు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రభుత్వ సేవా కాలంలో అందించిన ప్రేమాభిమానాలు, ప్రోత్సాహం, సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు. అలాగే కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవ సమాచారాన్ని చేరవేయడంలో తనతో కలిసి పనిచేసిన మీడియా మిత్రులు, జర్నలిస్టులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే తన భవిష్యత్ కార్యక్రమాలకు కూడా ఇదే సానుకూల సహకారం, ఆదరణ అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజ అభ్యున్నతి, యువత సాధికారత, మహిళల పురోగతి, ప్రజారోగ్య పరిరక్షణ మరియు ప్రజా సంక్షేమమే తన రాజకీయ ప్రయాణానికి ప్రధాన లక్ష్యాలని, ప్రజల ఆశీస్సులు, సహకారం తనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయని డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు

### జనసేనలో భారీ చేరికలు

దశ, విజయవాడ: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో తెలంగాణ రాష్ట్రం నుండి పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. బుధవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ఈ చేరికలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం నుండి డా.గడల శ్రీనివాసరావు, పెద్దపల్లి నుండి గొట్టిముక్కల నరేష్‌రెడ్డి, సరూర్ నగర్ నుండి ప్రేమ్ గాంధీ, కరీంనగర్ నుండి అమ్రపెల్లి గంగాధర్, కోదాడ నుండి పర్వతం సైదా చారి, హైదరాబాద్ నుండి సాయి ఈశ్వర్ రెడ్డి, సిద్దిపేట్ నుండి కమ్మరి శ్రీను, జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. భవిష్యత్‌లో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఉండే అవకాశం ఉందని తెలుస్తుంది.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

❖ *మంత్రి తుమ్మల నాగేశ్వరరావు*




**దశ, ఖమ్మం:** ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. వ్యవసాయం, నీటిపారుదల, పంచాయతీరాజ్, శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ గారు, ఖమ్మం జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఫిట్‌నెస్ లేని విద్యా సంస్థల బస్సులు రోడ్లపై తిరిగితే సీజ్

❖ *భద్రాచలం MVI సంగం వెంకట పుల్లయ్య*



**దశ, మణుగూరు:** పిల్లలు తల్లిదండ్రుల ఆశలు, దేశ భవిష్యత్తు అని, వారి భద్రతను కాపాడాల్సిన బాధ్యత విద్యా సంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లు, సహాయకులతో పాటు రవాణా శాఖపై కూడా ఉందని భద్రాచలం యూనిట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య పేర్కొన్నారు. విద్యా సంస్థలకు చెందిన ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బుధవారం రవాణా శాఖ భద్రాచలం యూనిట్ కార్యాలయం ఆధ్వర్యంలో మణుగూరు స్నేహ గార్డెన్స్‌లో మణుగూరు డివిజన్ పరిధిలోని విద్యా సంస్థల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షులు అరవింద్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భద్రాచలం MVI సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ.. విద్యా సంస్థల బస్సులకు ప్రత్యేక నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రతి విద్యా సంస్థ బస్సు రవాణా శాఖ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని తెలిపారు. ప్రతి బస్సుకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ (PUC) ధృవపత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, స్పీడ్ గవర్నర్, జీపీఎస్, అత్యవసర సంప్రదింపు వివరాలు వంటి భద్రతా సదుపాయాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. స్కూల్ బస్సు డ్రైవర్‌కు కనీసం ఐదు సంవత్సరాల అనుభవంతో కూడిన చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలు మించకూడదని పేర్కొన్నారు. అలాగే 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల బస్సులను విద్యార్థుల రవాణాకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సు ఎక్కే, దిగే సమయంలో అటెండెంట్ అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సూచించారు. వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై నడిపితే సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

### "ARRIVE – ALIVE" కార్యక్రమం లక్ష్యం ప్రాణాల రక్షణే

రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ARRIVE - ALIVE" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడమేనని సంగం వెంకట పుల్లయ్య తెలిపారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఎన్నో ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఉదయం బస్సులో ఎక్కే విద్యార్థి సాయంత్రం క్షేమంగా తన ఇంటికి చేరుకోవడమే అందరి లక్ష్యంగా ఉండాలని, పిల్లల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు ఎమ్ అరవింద్ కుమార్, జి. మధు సూదన్ రెడ్డి, MD. ఈసబ్ షరీఫ్, ప్రతాప్ రెడ్డి, ఐజాక్ థామోస్, శ్రీనివాస్, చంద్ర మౌళి, సంపత్ రెడ్డి, జానిమియా ఖాన్, రామన్ రెడ్డి, నరేందర్, డ్రైవర్లు, సహాయకులు, రవాణా శాఖ సిబ్బంది భీముడు తదితరులు పాల్గొన్నారు.

# మధిరకు ఐటీ హబ్



- భట్టి విక్రమార్క హామీ అమలు
- మధిరలో ఐటీ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు
- 1.16 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఐటీ టవర్ నిర్మాణం
- స్థానిక యువతకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కల్పనకు మార్గం
- సమగ్ర ప్రాజెక్టు నివేదిక (DPR) సిద్ధం చేయాలని టీజీఐఐసీకి ఆదేశాలు

**దశ, మధిర:** మధిర నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో కీలక హామీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అమలు చేశారు. మధిరలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ఐటీ టవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. మధిర గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 43లో ఉన్న 1.16 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ ప్రతిష్టాత్మక ఐటీ హబ్ నిర్మించనున్నారు.

ఐటీ మరియు కమ్యూనికేషన్స్ శాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు మార్గం సుగమమైంది. ఐటీ హబ్ నిర్మాణానికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (DPR) సిద్ధం చేయాలని తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (TGIIC)ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టుకు సంబంధించిన వ్యయ అంచనాలు, బడ్జెట్ అవసరాలపై నివేదికలను త్వరితగతిన సమర్పించాలని సూచించింది.

మధిరకు ఐటీ హబ్ మంజూరు కావడంతో నియోజకవర్గ ప్రజలు, యువత, మేధావులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు సొంత ప్రాంతంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఇతర అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించనున్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా మధిర పట్టణంలోని మల్లు భట్టి విక్రమార్క గారి క్యాంపు కార్యాలయంలో మధిరకు ఐటి హబ్ మంజూరు చేసినందుకు మల్లు భట్టి విక్రమార్క గారికి ధన్యవాదాలు తెలియజేశారుఈ కార్యక్రమంలో మధిర తెలియజేశారు. చైర్మన్ సామినేని సుజాత జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వైస్ చైర్మన్ కోన ధని కుమార్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మిర్యాల వెంకటరమణ గుప్తా, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, , మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, కౌన్సిలర్ బోడేపూడి రేవతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జనరల్ సెక్రటరీ పులిబండ్ల చిట్టిబాబు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, డివిజన్ కమిటీ అధ్యక్షురాలు అద్దంకి మంజీరా, కాంగ్రెస్ నాయకులు తన్నీరు రామకృష్ణ, రంగా శ్రీనివాసరావు, సామినేని రామనాథం, సిద్ధంశెట్టి సందీప్ మొదలగు వారు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అటవీశాఖ బైక్ ర్యాలీ

**దశ, పినపాక:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈబయ్యారం అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ చేపట్టామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత తెలిపారు. అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఈబయ్యారం క్రాస్ రోడ్ వరకు, అక్కడి నుంచి ఉప్పాక బ్రిడ్జి వరకు, అనంతరం పినపాక జూనియర్ కళాశాల వరకు ర్యాలీ కొనసాగించామని తెలిపారు.




ర్యాలీ సందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వృక్ష సంపద పెంపుదలపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అడవులు ప్రకృతి సమతుల్యతకు మూలాధారమని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెట్లను నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. అటవీ సంపదను కాపాడటం ద్వారా వన్యప్రాణులు, జీవ వైవిధ్యం రక్షించబడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు మాధవి, వెంకటేశ్వర్లు, అటవీశాఖ సిబ్బంది పాల్గొని పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీకి స్థానిక ప్రజలు కూడా సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆటవిశాఖ సిబ్బంది, ఎఫ్బిఓలు పాల్గొన్నారు.